కార్యదర్శుల కొరత.. ప్రజలకు వెత

- మందగించిన అభివృద్ధి పనులు
- పట్టించుకోని మండల పరిషత్ అధికారులు

మండలంలో పంచాయతీ పాలన కార్యదర్శుల కొరతతో కుంటుపడుతోంది. మొత్తం 29 పంచాయతీలు ఉండగా, 16 మంది మాత్రమే కార్యదర్శులు ఉన్నారు. వారిలో 10 మంది పలు గ్రామాలకు ఇన్‌చార్జులుగా వ్యవహరిస్తున్నారు. మిగతా గ్రామాలకు కార్యదర్శులు లేకపోవడంతో ప్రజలు సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు పడుతున్నారు.



మండల పరిషత్ కార్యాలయం

పొన్నూరు: కార్యదర్శుల కొరతతో ఒక్కో కార్యదర్శికి రెండు నుంచి మూడు పంచాయతీలు అప్పగించడంతో మండలంలో పాలన దాదాపు స్తంభించిపోయింది. రక్షిత మంచినీటి పథకాల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బంది పడాల్సి వస్తోంది. పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. జనన, మరణ రిజిస్టర్ల నిర్వహణ, పన్ను విధింపు, వసూళ్లతో పాటు ప్రస్తుతం నిర్వహిస్తున్న సర్వేల పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. పలు పంచాయతీల్లో ప్రజలు కార్యదర్శుల కోసం మండల పరిషత్తు కార్యాలయానికి వెళ్లాల్సి వస్తోంది. వ్యయ ప్రయాసలతో అక్కడికి వెళ్లినా కార్యదర్శులు అందుబాటులో ఉండకపోవడంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు. ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శులు ఉన్నా వారు ఎప్పుడు ఎక్కడ ఉంటారో తెలియక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొత్త ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చింది. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలంటే సమర్థులైన అధికారులు ఉండాలి. గ్రామస్థాయి అధికారులు అందరూ ఉంటే సంక్షేమ ఫలాలు సక్రమంగా అందుతాయని ప్రజలు భావిస్తున్నారు. అధికారులు లేని గ్రామాలకు నియమించేందుకు ప్రభుత్వం ఇప్పుడైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. 23 గ్రామాలకు కేవలం 10 మంది కార్యదర్శులు ఉన్నారు. వీరు ఇటు పూర్తిస్థాయి బాధ్యతలతో పాటు అటు అదనపు బాధ్యతలతో సతమతమవుతున్నారు. మిగిలిన 6 గ్రామాలకు పూర్తిస్థాయిలో కార్యదర్శులు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



పంచాయతీ కార్యదర్శుల కొరత విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారు లేకపోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులు వివరించాం. గ్రామాలకు పూర్తిస్థాయిలో కార్యదర్శులను నియమించే విధంగా చర్యలు చేపడతాం. ప్రస్తుతం ఉన్న వారితోనే ప్రజలకు సేవలు అందించేలా చర్యలు తీసుకొంటున్నాం.

–గుమ్మా చంద్రశేఖరరావు, ఎంపీడీవో, పొన్నూరు

గ్రామాలు	కార్యదర్శి పేరు
ఆలూరు, కొండముది	డి. శాంతకుమారి
ఆరెమండ, బ్రాహ్మణకోడూరు	బి. సునీత
చింతలపూడి, మునిపల్లె, వల్లభరావుపాలెం	వి. శ్రీనివాసరావు
దండమూడి, గాయంవారిపాలెం,	పి. శ్రీనివాసరావు
గోళ్లమూడిపాడు, తాళ్లపాలెం	ఎం. మణికంఠ
కసుకర్రు, మాచవరం,	షేక్. పహీం బాషా
మామిళ్లపల్లి, వడ్డిముక్కల	జి. రామకృష్ణ
మన్నవ, నండూరు, పచ్చలతాడిపర్రు	పి. రవిబాబు
పెదపాలెం, పెద ఇటికంపాడు,	జి. మధులత
ములకుదురు, ఉప్పరపాలెం, వెల్లలూరు	బి. పుష్పలత

క్లుప్తంగా

విజ్ఞాన్ విద్యార్థికి పీహెచ్‌డీ ప్రదానం



చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అప్లైడ్ సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ విభాగానికి చెందిన విద్యార్థి సూర్య చంద్రం జెట్టిబోయినకి విజ్ఞాన్ యూనివర్సిటీ శనివారం పీహెచ్‌డీ పట్టా అందజేసిందని వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ తెలిపారు. 'సూపర్ హైడ్రోఫోబిక్ పోరస్ కోఆర్డినేషన్ పాలిమర్స్ (పీసీపీఎస్) అండ్ నానో-షీట్ పీసీపీఎస్ ఫర్ గ్యాస్ స్టోరేజ్ అండ్ ఎలక్ట్రోకెమికల్ వాటర్ స్ప్లిట్టింగ్' అనే అంశంపై విద్యార్థి పరిశోధన చేశారని వీసీ తెలిపారు. సూర్య చంద్రంను చైర్మన్ లావు రత్తయ్య, డీన్లు, తదితరులు అభినందించారు.

పోలీసుల తనిఖీలు



పొన్నూరు: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భద్రతా చర్యల్లో భాగంగా పట్టణ ఎస్ఐ శ్రీహరి ఆధ్వర్యంలో పట్టణంలోని లాడ్జీలు, ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్, పరిసర ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించారు. బస చేస్తున్న వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్‌ను పరిశీలించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారి సమాచారం ఇవ్వాలని నిర్వాహకులకు సూచించారు.

అధ్యాపకులకు అవగాహన సదస్సు



గుంటూరు రూరల్: మండలంలోని గోరంట్ల గ్రామంలోగల సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో ఐదు రోజులుగా జరుగుతున్న ఐసీటీ టూల్స్‌పై అధ్యాపకుల శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య మాట్లాడుతూ విద్యార్థులకు సులభతరమైన పద్ధతిలో, అర్థవంతంగా విద్యాబోధన చేసేందుకు ఇలాంటి శిక్షణ తరగతులు ఎంతో ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో భాగంగా డేటా వ్యాలీ సంస్థ ప్రతినిధులు టి. ప్రమోద్, ఎ. చక్రవర్తిలు అడ్వాన్స్ ఎక్సెల్‌పై అధ్యాపకులకు అవగాహన కల్పించారు. అనంతరం సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

పహల్గాం మృతులకు నివాళి



ప్రత్తిపాడు: పెహల్గాంలో ఉగ్రమూకల దాడిలో అసువులు బాసిన మృతులకు చిన్నారులు నివాళులర్పించారు. పెదనందిపాడులోని తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రం కన్వీనర్ దొప్పలపూడి రమేష్‌బాబు ఆధ్వర్యంలో శనివారం చిన్నారులు కొవ్వొత్తులు వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు.

రేపు పీజీఆర్ఎస్ రద్దు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ మేయర్ ఎన్నికకు ఎన్నికల సంఘం ఇచ్చిన నోటిఫికేషన్ దృష్ట్యా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్, డయల్ యువర్ కమిషనర్) కార్యక్రమాలను రద్దు చేసినట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగర పాలక సంస్థ కాల్ సెంటర్ 0863-2345103 ఫిర్యాదు చేయవచ్చునన్నారు.

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోండి

చేబ్రోలు: రైతులు, మహిళలు, వ్యాపారులు అన్ని వర్గాల ప్రజలకు బ్యాంకులు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని బ్యాంక్ ఆఫ్ ఇండియా మాజీ మేనేజ్ ఆర్ఎస్ శంకరరావు అన్నారు. మండల కేంద్రమైన చేబ్రోలులోని రైతు సేవా కేంద్రంలో శనివారం యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ రూరల్ ట్రైబల్ డెవలప్‌మెంట్ సోషల్ సర్వీస్ సొసైటీ (ఆర్డిడ్స్) మరియు ఆర్‌బీఐ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. రిసోర్స్ పర్సన్, కౌన్సిలర్ యశ్వంత్ శ్రీనివాస్ మాట్లాడుతూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విధానాలతో ప్రభుత్వ పథకాలను, రుణాలకు సంబంధించి, రైతులకు అందిస్తున్న సబ్సిడీల గురించి వివరించారు. బ్యాంక్ అకౌంట్ ఉన్న వారికి జీవన జ్యోతి, అటల్ పెన్షన్ యోజన, సురక్ష బీమా పథకాలు పొందవచ్చునన్నారు. బ్యాంక్ ఖాతాదారులకు ఎక్కువ మందికి అవగాహన కల్పించటం కోసం ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డిడ్స్ సెక్రటరీ వై సాంబశివరావు, మండల వ్యవసాయ శాఖాధికారి బి శ్రీనివాస నాయక్, ఏఈవో మణికంఠ, వివిధ గ్రామాలకు చెందిన 60 రైతులు, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్ఎస్ శంకరరావు

శిక్షణ శిబిరాలతో మానసికోల్లాసం

ప్రత్తిపాడు: వేసవి శిక్షణ శిబిరాలతో విద్యార్థులకు మానసిక ఉల్లాసం లభిస్తుందని పీఏసీఎస్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గుర్రం వీరరాఘవయ్య అన్నారు. మండల కేంద్రం పెదనందిపాడులోని తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో శనివారం వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా రాఘవయ్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విజ్ఞాన కేంద్రం కన్వీనర్ దొప్పలపూడి రమేష్ బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరాల ద్వారా విద్యార్థులు స్నేహ భావం పెంపొందించుకోవాలని కోరారు. క్రమశిక్షణ, మంచి అలవాట్లు వస్తాయని చెప్పారు. మానసిక ఉల్లాసంతో పాటు పోటీతత్వాన్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు. ఎస్టీయూ నాయకుడు గేరా మోహనరావు మాట్లాడుతూ ఈ శిబిరం పిల్లలకు ఉపయోగపడుతుందని అన్నారు. పాటలు, పద్యాలు, ఆటలు, పెయింటింగ్, బొమ్మలు వేయడం లాంటివి నేర్చుకోవాలని అన్నారు. విజ్ఞాన కేంద్రం కన్వీనర్ దొప్పలపూడి రమేష్ బాబు, పెన్షనర్స్ సంఘం సీనియర్ నాయకుడు గారపాటి రమేష్, కేంద్రం నిర్వాహకులు జంపని రామారావు, షేక్ షమి, మర్రి లక్ష్మి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ వీరరాఘవయ్య

ఏఐ టెక్నాలజీపై అవగాహన అవసరం

ప్రత్తిపాడు: ఏఐ టెక్నాలజీపై యువతకు, విద్యార్థులకు అవగాహన అవసరమని యూసీఎస్ఐ యూనివర్సిటీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్నోవేషన్ డైరెక్టర్ కొలందైసామి అన్నారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో అడ్వాన్స్ కమ్యూనికేషన్, కంప్యూటింగ్, ఎలక్ట్రానిక్ సిస్టమ్-2025 పేరుతో శనివారం అంతర్జాతీయ సదస్సు జరిగింది. మలినేని కళాశాలలు, యూసీఎస్ఐ విశ్వవిద్యాలయం (మలేషియా) టెక్నికల్ స్పాన్సర్స్ చేసిన ఈ కాన్ఫరెన్స్‌కు అంతర్జాతీయంగా 200కు పైగా పరిశోధన పత్రాలు అందాయి. వాటిలో 47 పరిశోధన పత్రాలను నిర్వాహకులు ఆమోదించారు. కీనోట్ స్పీకర్‌గా ప్రొఫెసర్ డాక్టర్ రేణు, యూసీఎస్ఐ యూనివర్సిటీ డైరెక్టర్ కొలందైసామిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కొలందైస్వామి మాట్లాడుతూ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వలన కలిగే ప్రయోజనాలతో పాటు ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వీఐటీ ప్రొఫెసర్ డా.జయేంద్ర కుమార్ మాట్లాడుతూ కమ్యూనికేషన్ రంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పులు, వీఎల్ఎస్ఐ పాత్రపై విద్యార్థులు, నిపుణులతో చర్చించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు మాట్లాడుతూ విద్యార్థులు ఇన్నోవేషన్స్ రీసెర్చ్ మీద ఎక్కువ అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జెట్టి అప్పారావు, డైరెక్టర్ డాక్టర్ దేవిరెడ్డి శ్రీనివాసకుమార్, డా.అనిల్ కుమార్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.


సదస్సులో డైరెక్టర్ కొలందైసామి, చైర్మన్ పెరుమాళ్లు తదితరులు

కళాశాలల నిర్వాహకులపై చర్య తీసుకోవాలి

లక్ష్మీపురం: కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలల్లో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా కళాశాలలు నడిపేవారిపై చర్యలు తీసుకోవాలని ఆర్ఐఓ జుబేర్‌కు ఎస్ఎఫ్ఐ నాయకులు శనివారం వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ మాట్లాడుతూ ఏప్రిల్ 23న రాష్ట్ర ప్రభుత్వం కళాశాలలకు సెలవులు ప్రకటించిందన్నారు. కానీ కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కళాశాలలను నడుపుతూ ఎంతో మంది విద్యార్థులను మానసికంగా ఇబ్బంది పెడుతున్నారన్నారు. ఇప్పుడే సిలబస్ ప్రారంభిస్తామని, మీరు రాకపోతే మళ్లీ సిలబస్ బోధించమని ఒత్తిడి చేస్తున్నారని చెప్పారు.

నేటి నుంచి వార్షిక మహోత్సవాలు

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం ముట్లూరులో కొలువుదీరిన గోపయ్య సమేత శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ వారి ఆలయ 27వ వార్షిక మహోత్సవాలు ఆదివారం ప్రారంభం కానున్నాయి. 27వ తేదీన అఖండ జ్యోతి స్థాపన, ప్రత్యేక పూజలు, 28న శ్రీ ఆదిశక్తి అంకమ్మతల్లికి బోనాల సమర్పణ, శ్రీ లక్ష్మీ తిరుపతమ్మకు కంకుమ, మల్లెపూలతో సహస్ర నామావళి, సాయంత్రం బలిహరణ, రాత్రి శ్రీ తిరుపతమ్మ-గోపయ్య స్వామి ఉత్సవమూర్తుల ఊరేగింపు, 29న అమ్మవారికి పొంగళ్ల నివేదన, కంకుమ పూజలు జరగనున్నాయి. ఉత్సవాల్లో విద్యుత్ ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఇప్పటికే ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించాయి. విద్యుత్తు దీప కాంతులతో ఆలయం నూతన కాంతులీనుతోంది. వేద పండితులు దండిబొట్ల కృష్ణ శర్మ, మాధవశర్మల నేతృత్వంలో పూజలు జరగనున్నాయి.


గోపయ్య సమేత శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ వారు


విద్యుత్ కాంతులలో ఆలయం

భక్తిశ్రద్ధలతో ఉరుసు వేడుకలు


పెదకాకానిలో అలంకరణలో కరిముల్లా షా ఖాదరి నిషాని


విద్యుత్ దీపాలతో కళకళలాడుతున్న ప్రాంగణం

పెదకాకాని: కరిముల్లా షా ఖాదరి నిషాని ఉరుసు గంధ మహోత్సవాలు శనివారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. పెదకాకాని బాజీనగర్‌లోని కరిముల్లా షా ఖాదరి నిషాని వారి 16వ ఉరుసు గంధ మహోత్సవాలు పురస్కరించుకుని రాష్ట్ర నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మూడు రోజుల ఉత్సవంలో భాగంగా తొలిరోజు శనివారం రాత్రి కంబల్ ఫాతేహా జరిగింది. కరిముల్లా షా ఖాదరి నిషాని గజమాలలతో శోభాయమానంగా అలంకరించారు. విద్యుత్ కాంతులతో దర్గా ప్రాంగణం కళకళలాడుతోంది. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు ప్రదక్షిణలు చేసి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నిషాని ధర్మకర్త పఠాన్ మహబూబ్ సుభాని ఆధ్వర్యంలో కంబల్ ఫాతేహా నిర్వహించారు. పెదకాకాని బాజీనగర్‌లోని ధర్మకర్త మహబూబ్ సుభాని ఇంటి వద్ద ఆదివారం నుంచి మేళతాళాలు, సన్నాయి వాయిద్యాల మధ్య గంధం, గుర్రం ఊరేగింపుగా బయలుదేరి గ్రామోత్సవం కొనసాగింది. సోమవారం ఉదయం 11 గంటలకు కరిముల్లా షా ఖాదరి బాబా వారి నిషానికి చేరుకుని బాబా సలామి, ఖురాన్ చదివి అనంతరం భక్తులకు బాబా గంధం పంపిణీ చేయడం జరుగుతుందని ధర్మకర్త తెలియజేశారు. ప్రార్థనా కార్యక్రమాల అనంతరం రాత్రి వేళలో భక్తులందరికీ అన్నసంతర్పణ జరిగింది.

ఉపాధి పనుల్లో అక్రమాలు జరిగితే చర్యలు

ప్రత్తిపాడు: ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పెదనందిపాడు ఎంపీడీవో లక్ష్మీదేవి హెచ్చరించారు. మండలంలోని కర్రపాడు, పెదనందిపాడు, పాలపర్రు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం ఆమె సంబంధిత శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. కూలీలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. జాబ్ కార్డులు కలిగిన ప్రతి ఒక్కరికీ వంద రోజులు పని కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. వెంట ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు, ఉపాధి అధికారులు ఉన్నారు.


కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో లక్ష్మీదేవి

రేపటి నుంచి వేసవి శిక్షణ శిబిరం

గుంటూరు రూరల్: మండలంలోని ఏటుకూరు గ్రామంలోగల గ్రంథాలయంలో ఈ నెల 28వ తేదీ నుంచి సమ్మర్ క్యాంప్ జరుగుతోంది. విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు గ్రంథాలయం అధికారిణి పీ పరమేశ్వరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు పుస్తకాలు చదివించడం, కథలు చెప్పటం, డ్రాయింగ్, పెయింటింగ్, స్పోకెన్ ఇంగ్లిష్, ఆటలు, క్విజ్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రోజు ఉదయం 8 - మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని తెలిపారు.

క్రికెట్ విజేతలకు బహుమతులు ప్రదానం

గుంటూరు రూరల్: పరుచూరి వీరరాఘవులు సేవా సంఘం ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా నల్లపాడులోని రైల్వే గ్రౌండ్స్‌లో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ శనివారంతో ముగిసింది. కార్యక్రమంలో గుంటూరు వెస్ట్ ఎమ్మెల్యే గల్లా మాధవి పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పరుచూరి సంజీవరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో సాగర్ వారియర్స్ మొదటి స్థానం, జానీస్ లెవెన్ ద్వితీయ స్థానం, లోకల్ బాయ్స్ జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. ఈ సందర్భంగా విజేతలను అభినందించారు.

ఉచిత వైద్య పరీక్షలు



ప్రత్తిపాడు: మానవ సేవే మాధవ సేవ అని రోటరీ డైరెక్టర్ పోపూరి లక్ష్మీనారాయణ అన్నారు. మండల కేంద్రం పెదనందిపాడులోని అశోక పాఠశాలలో గుంటూరుకు చెందిన అంజలి హాస్పిటల్ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించింది. ముఖ్య అతిథిగా హాజరైన రోటరీ డైరెక్టర్ లక్ష్మీనారాయణ శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యులు డాక్టర్ గోవింద్, దుర్గాప్రసాద్‌లు సుమారు వంద మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. మాత్రలు అందజేశారు.

30న జాబ్ మేళాపై అవగహన సదస్సు

నెహ్రూనగర్: స్మార్ట్ టెక్స్, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మే 15వ తేదీలోపు నిర్వహించనున్న గుంటూరు మెగా జాబ్ మేళాకు సంబంధించి ఈ నెల 30 స్థానిక శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఉదయం నిర్వహించనున్న వర్క్ షాప్‌కు రిజిస్ట్రేషన్ చేసుకున్న నిరుద్యోగ యువత తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. జిల్లాలో 10వ తరగతి ఆపైన చదివిన నిరుద్యోగ యువతకు వారి అర్హతకు తగిన విధంగా ఉండేలా సుమారు 50 కంపెనీల నుంచి ఉద్యోగాలు అందించేలా బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించనున్నామన్నారు.

సెప్టిక్ వ్యర్థాలను రోడ్ల పక్కన వేస్తే కఠిన చర్యలు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో ఎక్కడా సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలను రోడ్ల పక్కన, డ్రైయిన్లలో వేయడానికి వీలు లేదని, అలా వేసే ట్యాంకర్లను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు హెచ్చరించారు. నగరంలోని సెప్టిక్ ట్యాంకర్ల యజమానులు, కాంట్రాక్టర్లతో శనివారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎస్ఈ మాట్లాడుతూ సఫాయి కర్మచారి చట్టం 2013 ప్రకారం సెప్టిక్ ట్యాంకర్ల వద్ద పని చేసే సిబ్బంది తప్పనిసరిగా పీపీఈ కిట్‌లు ధరించే విధులు నిర్వహించాలని కోరారు. జీఓ 134 మేరకు ప్రతి సెప్టిక్ ట్యాంకర్ యజమాని/ కాంట్రాక్టర్ తప్పనిసరిగా స్థానిక సంస్థల్లో రిజిస్టర్ చేసుకొని, తగిన లైసెన్స్ తీసుకొని, నిర్దేశిత ఫీజులు వసూలు చేసుకోవాలన్నారు. నగరంలోని సెప్టిక్ ట్యాంకర్లు తప్పనిసరిగా సుద్దపల్లి డొంకలోని నగరపాలక సంస్థ ఎఫ్ఎస్టీపీకే వ్యర్థాలను తరలించాలని, అక్కడ శాస్త్రీయ పద్ధతిలో నిర్వహణ చేయడం జరుగుతుందని వివరించారు. నగరపాలక సంస్థ తరఫున ప్రత్యేక రిజిస్ట్రేషన్ చేస్తామని, రిజిస్ట్రేషన్ లేకుండా ఉండే వాహనాలను సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం మాట్లాడుతూ సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలను ఆరుబయట వదలడం ప్రజారోగ్యానికి, పర్యావరణానికి ప్రమాదమన్నారు. వ్యర్థాల్లో ఉండే సూక్ష్మ క్రిములు భూమిలోకి ఇంకడం ద్వారా నీటి కాలుష్యం, గాలిలో కలిసి వాయు కాలుష్యం జరుగుతుందన్నారు. నిర్వాహకులు తప్పనిసరిగా నిర్దేశిత విధానంలో వ్యర్థాలను తరలించాలని కోరారు. సమావేశంలో ఈఈ కోటేశ్వరరావు, డీఈఈ నాగభూషణం, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కన్సల్టెంట్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.


సెప్టిక్ ట్యాంక్ నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎస్ఈ